## స్పీకర్‌ను కలిసిన ఆలయ ట్రస్టు సభ్యుడు



కంటోన్మెంట్‌లోని పెరుమాల్ వేంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్టు సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు నరేశ్ శనివారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

– కంటోన్మెంట్

## పద్మారావును భారీ మెజార్టీతో గెలిపిద్దాం

సికింద్రాబాద్, ఏప్రిల్ 20: సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పిలుపునిచ్చారు. శనివారం డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి పద్మారావు గెలుపు కోరుతూ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. పద్మారావుగౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలంతా సైనికుల్లా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో.. ఉప వైద్యాధికారికి తీవ్ర గాయాలు

బొల్లారం, ఏప్రిల్ 20: మితిమీరిన వేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో వైద్యాధికారిని ఢీకొట్టిన ఘటన శనివారం బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉప వైద్యాధికారి ఆనంద్ కుమార్(55) రాజీవ్ రహదారిపై పండ్లు కొనేందుకు కారు దిగి వెళ్తున్నాడు. వెనుక నుంచి వేగంగా ఓ వ్యక్తి కారుతో ఢీకొట్టాడు. ఘటనలో ఆనంద్‌కు తీవ్ర గాయాలై ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కారు డ్రైవర్ నరేందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ప్రచారంలో గులాబీ దూకుడు

- బీఆర్‌ఎస్ అభ్యర్థికి జన నీరాజనం
- మూడో వార్డులో బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత, రాగిడి రజిని ప్రచారం
- కంటోన్మెంట్‌లో గెలుపు ఖాయం: ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 20: కంటోన్మెంట్ ఉప ఎన్నిక, మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కారు టాప్‌గేర్‌లో దూసుకుపోతుంది. అన్ని పార్టీలకంటే ఎన్నికల ప్రచారంలో గులాబీ దూకుడు పెంచింది. శుక్రవారం రాత్రి కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి రాగిడి రజినిలక్ష్మారెడ్డి, మాజీ బోర్డు సభ్యురాలు అనితాప్రభాకర్‌తో కలిసి మూడో వార్డులో కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి ఇంటింటికీ ప్రచారం చేశారు. అంబేద్కర్‌నగర్, శ్రీరాంనగర్, గాంధీనగర్, బ్యారెస్ లైన్, కంటోన్మెంట్ క్వార్టర్లలో నిర్వహించిన ప్రచారానికి జనం నీరాజనాలు పలికారు. ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు మద్దతు పలకాలని ఆయన కోరారు. అందరూ దీవెనలు అందించి, భారీ మెజార్టీతో అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని విన్నవించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికతో పాటు మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లోనూ గులాబీపార్టీకే ఓటేయాలని, కాంగ్రెస్, బీజేపీలకు వేస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలతో పాటు బీఆర్‌ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి కంటోన్మెంట్‌లో స్పష్టంగా కనిపిస్తుందని, బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయ చైర్మన్ రాజుసింగ్, సీనియర్ నాయకులు ఉమేశ్, సంధ్య, స్వరూప, గీత, సబిత, అనిల్, చిన్న, రాకేశ్, సచ్చు, మధు, అశోక్, శేఖర్, శ్రీను, సాధిక్, అక్తర్, అహ్మద్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత, మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణి రాగిడి రజిని

# కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం

- నాలుగో వార్డు ప్రచారంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.నివేదిత
- ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్న గులాబీ దళం

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 20: కంటోన్మెంట్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్‌ఎస్ అభ్యర్థి జి.నివేదిత అన్నారు. నాలుగో వార్డులో శనివారం స్థానిక బోర్డు మాజీ సభ్యురాలు నళినికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముదిరాజ్ బస్తీ, యాదవబస్తీ, దోబీ, అంజనమ్మ కాలనీల్లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంతోపాటు దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన పలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. నివేదిత మాట్లాడుతూ.. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వినోద్ కుమార్, శ్రీకాంత్, రామ్మోహన్, సంతోష్, గణేశ్, ఆనంద్, హ్యాపీ టీం సభ్యులు, మహేశ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నాలుగో వార్డు ప్రచారంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత



కారు గుర్తుకే ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత



ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదితను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

## తిరుమలను దర్శించుకున్న తలసాని



తిరుమలలో తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబ సభ్యులు

బేగంపేట్, ఏప్రిల్ 20: మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శనివారం తిరుమల వేంకటేశ్వరస్వామిని తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. సుప్రభాత సేవలో పాల్గొని స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. తలసానితో పాటు కుటుంబసభ్యులు సాయికిరణ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

## 22న బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం

సికింద్రాబాద్, ఏప్రిల్ 20: ఈనెల 22న ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ అసెంబ్లీ స్థాయి బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తామని సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధురానగర్ ఎస్‌ఆర్ ఆసుపత్రి ఎదురుగా రాఘవగార్డెన్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, బూత్‌స్థాయి కమిటీ క్రియాశీలక పార్టీ శ్రేణులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## రాకేశ్ మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ



రాకేశ్‌కిరణ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ కోట నీలిమ

అమీర్‌పేట్, ఏప్రిల్ 20: అధిక వడ్డీ వేధింపులే రాకేశ్‌కిరణ్ (32) బలవన్మరణానికి కారణమైందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న యువకుడు వడ్డీ వ్యాపారుల వేధింపులకు బలికావడం బాధాకరమని అన్నారు. కారకులైన వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధిక వడ్డీలు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టాలున్నా, అమలు చేయడంలో విఫలమవుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని అన్నారు. రాకేశ్ మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అయితే రాకేశ్ శుక్రవారం ఉదయం ఓ రైల్వే ట్రాక్‌పై నడుస్తూ, వడ్డీ వ్యాపారులు తనను ఏ విధంగా వేధింపులకు గురి చేసింది రికార్డు చేశారు. తన ఇంటి వద్దకు వచ్చి తనను కించపరిచారని, అంతేగాకుండా మానసిక వేదనకు గురిచేసిన తీరును తప్పుబడుతూ, భావోద్వేగంతో చేసిన సెల్ఫీ వీడియో వైరల్‌గా మారింది.

## అభివృద్ధి పనులను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు



బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని బేగంపేట్ డివిజన్ ఆ పార్టీ నాయకుడు శ్రీహరి తెలిపారు. ప్యాంటలూన్ లైన్‌లో రూ.60లక్షలతో ప్రారంభించిన రోడ్డు పనులను ఇటీవల అధికారులు షురూ చేశారు. కాగా పనులను పార్టీ నాయకులు శ్రీహరి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి శనివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరినట్టు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

– బేగంపేట

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సరిత



కంటోన్మెంట్ ఏడో వార్డు కు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు నాగినేని సరిత శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ హస్తం పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్, యువజన నాయకులు నీరజ్ తదితరులు పాల్గొన్నారు.

– బొల్లారం

## హస్తం గూటికి 'ముప్పిడి'



కంటోన్మెంట్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్ శనివారం కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ముప్పిడి మధుకర్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాస్కర్, శేఖర్‌ముదిరాజ్, నర్సింగ్, సతీశ్, భరత్‌రెడ్డి, ముప్పిడి సిద్ధాంత్ తదితరులు ఉన్నారు.

– కంటోన్మెంట్

# ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో సీఎంఏ పాత్ర కీలకం

- ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్ కుమార్‌జీ దళ్వాడి

అమీర్‌పేట్, ఏప్రిల్ 20: దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ) పాత్ర కీలకమని ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్ కుమార్‌జీ దళ్వాడి అన్నారు. ప్రభుత్వం, విధాన నిర్ణేతలు, పరిశ్రమలు, కార్పొరేట్ ప్రపంచానికి సీఎంఏ బలమైన శక్తిగా ఉన్నారన్నారు. అమీర్‌పేట్‌లోని హోటల్ ఆదిత్య పార్క్‌లో ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో అశ్విన్ మాట్లాడుతూ.. సీఎంఏలు వ్యాపార కార్యకలాపాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నారన్నారు. కార్పొరేట్ విధానాలకు అవసరమైన పథకాలను రూపొందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణంలో తమ వంతు బాధ్యతలను నిర్వర్తిస్తున్నాయని చెప్పారు. నైపుణ్యం స్థిరమైన ఆర్థిక వృద్ధికి అనుకూల వాతావరణాన్ని సృష్టించడంలో తోడ్పడుతుందని తెలిపారు. ఐసీఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కేసీహెచ్‌ఏవీఎస్‌ఎన్ మూర్తి, ఐసీఎంఏఐ చైర్‌పర్సన్ (హైదరాబాద్ చాప్టర్) సీఎంఏ ఇమవిద్యా సనగవరపు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఎంఏఐ అధ్యక్షుడు అశ్విన్ కుమార్‌జీ దళ్వాడి

## మోసానికి కేరాఫ్ కాంగ్రెస్

అడ్డగుట్ట, ఏప్రిల్ 20: అబద్ధపు హామీలు, మోసపూరిత పాలనకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి అన్నారు. శనివారం మెట్టుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీజేపీ మరోమారు అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చుతారని కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌కు మొదటి నుంచి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని, అందుకే భారత రాజ్యాంగాన్ని 123 సార్లు సవరించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆమె తెలిపారు. ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి కర్ణాటక, తెలంగాణలో అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు.

## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

అమీర్‌పేట్, ఏప్రిల్ 20: శ్రీకాకుళం నుంచి తీసకువచ్చిన గంజాయిని భరత్‌నగర్‌లో అమ్ముతున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ ఎస్‌వోటీ బాలానగర్ టీమ్, సనతనగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. రూ.57,500ల ఖరీదు చేసే 2.5 కేజీల గంజాయిని, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం నుంచి వచ్చిన బచ్చల లోకేశ్ మోతీనగర్‌లో ఉంటున్నాడు. ఇతర రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ కూలీలు గంజాయిని ఎక్కువ తీసుకుంటున్న విషయాన్ని గ్రహించి, శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన గంజాయి అమ్మకాలు జరిపే నరేశ్ నుంచి గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు జరుపుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. శనివారం భరత్‌నగర్ ఫ్లైఓవర్ కింద అనుమానాస్పదంగా సంచరిస్తున్న లోకేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తే గంజాయిని అమ్మకం నిజమేనని అంగీకరించాడు. కాగా మరో నిందితుడు నరేశ్ పరారీలో ఉన్నాడు. సనత్‌నగర్ పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో కళాశారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శనివారం సత్యం డాన్స్ అకాడమీ గురువులు మేళ్లచెరువు కామేశ్వరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు.

– కొండాపూర్

# సికింద్రాబాద్ లోక్‌సభకు మూడు నామినేషన్లు



సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్లను అందజేస్తున్న అభ్యర్థులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 20: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు శనివారం జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో మూడు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. జైస్వరాజ్ పార్టీ అభ్యర్థిగా రాయపాటి సామ్యుల్, స్వతంత్ర అభ్యర్థులుగా సిద్ధిక్ అహ్మద్‌ఖాన్, మహ్మద్ అబ్దు అజీమ్ నామినేషన్ వేసినట్లు తెలిపారు.

## తాగి వాంతులు చేసుకుని యువకుడి మృతి

కొండాపూర్, ఏప్రిల్ 20: మద్యం సేవించిన ఓ యువకుడు వాంతులు చేసుకుని మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అస్సాం ఉత్తర లిఖింపూర్ జిల్లా పానిగావ్ గ్రామానికి చెందిన సీమంత దత్త రెండు నెలల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా దత్త రూమ్‌మేట్ ప్రభాకర్ డొరువా శుక్రవారం రాత్రి 10:30 గంటలకు ఫోన్ చేయగా కేశవనగర్‌లో ఉన్నట్లు తెలిపాడు. అక్కడికి వెళ్లి చూడగా మద్యం మత్తులో దత్త వాంతులు చేసుకుంటూ కనిపించాడు. రూమ్‌కు వెళదామనగా నేను తర్వాత వస్తానంటూ అక్కడే ఉండిపోయాడు. అర్ధరాత్రి తర్వాత తీవ్రంగా వాంతులు చేసుకుని మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## రూ. 54.52 లక్షలు సీజ్

మూసాపేట, ఏప్రిల్ 20: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కూకట్‌పల్లి పోలీసులు, బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శనివారం కూకట్‌పల్లి భాగ్యనగర్ కాలనీలోని అల్లూరి కాంప్లెక్స్ వద్ద ఇటాచీ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ వాహనాన్ని తనిఖీ చేయగా రూ. 54.52 లక్షల నగదు లభించింది. ఇటాచీ వాహన సెక్యూరిటీ గార్డ్ మహ్మద్ ఖలీల్ (21),కస్టోడియన్ పి.నగేశ్(22)లను అదుపులోకి తీసుకుని విచారించారు. పలు ఏటీఎంలలో క్యాష్ జమచేసేందుకు వెళ్తున్నట్టు తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

## మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

కొండాపూర్, ఏప్రిల్ 20: మద్యం తాగొద్దన్నందుకు భార్యతో గొడవ పడిన భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ భానుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన మోరి రాజు(32), భార్య, ముగ్గురు కూతుళ్లతో కలిసి నివాసం ఉంటున్నాడు. సెక్యూరిటీ గార్డుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన రాజు గత కొద్దిరోజులుగా డ్యూటీకి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వచ్చిన రాజుతో భార్య ప్రియాంక మద్యం తాగవద్దని గొడవ పడింది. దీంతో అర్ధరాత్రి తాను నిద్రిస్తున్న గది పైకప్పు హుక్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన ప్రియాంక పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న యువకుడు

కందుకూరు: దొరికిన ఆభరణాలను తిరిగిచ్చి యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. జైత్వారం రాణి తన తల్లిగారింటికి వెళ్లడానికి కందుకూరు మండల కేంద్రానికి వచ్చి బస్సు ఎక్కి వెళ్లే సమయంలో 30 తులాల వెండి పట్టగొలుసులు, చెవుల గొలుసును పోగొట్టుకుంది. దెబ్బడగూడకు చెందిన అజీజ్‌కు దొరకడంతో కందుకూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రావణ్‌కు అప్పగించాడు. సదరు మహిళలను పిలిపించి అప్పగించారు. అజీజ్‌ను ఎస్సై అభినందించారు. రంగారెడ్డి జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య పరీక్షల కోసం వచ్చి.. వ్యక్తి అదృశ్యం

దుండిగల్,ఏప్రిల్ 20: వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా అవుసులపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో నివాసముంటున్న బి.సిద్ధిరాములు(52), దుర్గమ్మ దంపతులు స్థానికంగా టీస్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిరాములు ఈనెల 4న గ్రామానికి చెందిన మరో పదిమందితో కలిసి బాచుపల్లిలోని మమత వైద్యశాలలో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి హాజరయ్యాడు. అతడిని పరీక్షించిన వైద్యులు ఎడమభుజం విరగడంతో పాటు కుడికాలులో వాపు ఉందని చికిత్స కోసం అడ్మిట్ కావాలని సూచించారు. దీంతో తనతో వచ్చిన వారు తిరిగి స్వగ్రామానికి వెళ్లిపోగా సిద్దిరాములు మాత్రం వైద్యశాలలోనే ఉన్నాడు. ఈ విషయాన్ని ఆసుపత్రి యాజమాన్యం సిద్దిరాములు భార్యకు ఫోన్‌లో చెప్పారు. రెండు రోజుల తర్వాత దుర్గమ్మ తన భర్తకు ఫోన్‌చేయగా మాట్లాడాడు. తిరిగి అదేరోజు సాయంత్రం ఎన్నిసార్లు ఫోన్‌చేసినా స్పందించకపోగా ఫోన్ స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఆందోళనకు గురైన దుర్గమ్మ ఈనెల 7న వైద్యశాలకు వెళ్లి చూడగా భర్త కనిపించలేదు. సిద్ధిరాములు బెడ్‌పై అతడి మెడికల్ రిపోర్ట్‌లు, బట్టలు, బ్యాగు మాత్రమే కనిపించాయి. వైద్యశాల సిబ్బందిని ప్రశ్నించగా 6న మధ్యాహ్నం నుంచే కనిపించకుండా పోయినట్లు చెప్పారు. దీంతో దుర్గమ్మ తన భర్త ఆచూకీ కోసం దవాఖాన పరిసరాలు, బంధువులను వాకబు చేసింది. ఫలితం లేకపోడంతో శనివారం బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శనలు

కొండాపూర్, ఏప్రిల్ 20: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం పలు పెయింటింగ్స్ సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిత్రకారుడు వీ లక్ష్మణ్ 'నేచర్ విత్ హ్యూమన్ ఫేస్' పేరుతో ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను సినీ నిర్మాత, దర్శకుడు లయన్ డాక్టర్ సాయివెంకట్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ప్రెసిడెంట్ ఎంవీ రమణారెడ్డి, సీనియర్ ఆర్టిస్ట్ విజయ్ కుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనలో 27 చిత్రాలను ఆదివారం వరకు ఉంచనున్నట్లు తెలిపారు. దేశంలోని చిత్రకారులు వేసిన 41 చిత్రాలతో 'అన్ ఇంక్లూజివ్ ఆర్ట్ ఎగ్జిబిషన్' పేరుతో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన ఈనెల 23 వరకు కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.